ఇరుకు వంతెనలతో ఇక్కట్లు


శతాబ్ది కాలంగా ప్రజలకు సేవలందిస్తున్న బ్రిటీష్ కాలం నాటి పూళ్ల వంతెన


గుండుగొలనులో నత్తనడకన సాగుతున్న వంతెన పనులు

- కాలం చెల్లిన వంతెనలపై బిక్కుబిక్కుమంటూ రాకపోకలు
- ఏ క్షణంలో కూలుతుందోనన్న భయం
- ప్రభుత్వం నిధులు వెచ్చించి నిర్మించాలని డిమాండ్


పాతూరు వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన


కురెళ్లగూడెం వద్ద రక్షణ గోడ కూలిన దృశ్యం

భీమడోలు: గోదావరి కాలువపై ఇరుకైన వంతెనలు ప్రాణసంకటంగా మారాయి. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన బ్రిటిష్ కాలం నాటి వంతెనలపై అధిక లోడు వాహనాలు రాకపోకలు సాగించడంతో ఏ క్షణంలో కూలుతాయోనన్న భయం ఆ గ్రామస్తులను వెంటాడుతుంది. నియోజకవర్గంలోని గుండుగొలను, నారాయణపురం గ్రామాల్లోని వంతెనలు కూలిపోగా, ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో వారి జీవన విధానం దెబ్బతింది. దీంతో పాటు భయం గుప్పెట్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే కాలం చెల్లిన ఆ వంతెనలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సామర్థ్యానికి మించి చేపల చెరువులకు వెళ్లే లారీలు ప్రయాణిస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఎన్నికల సమయంలో పాలకులు వంతెనలు నిర్మిస్తామని హామీలిస్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదని జనం విమర్శిస్తున్నారు. వంతెనలు కూలితే ప్రజా జీవనానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుంది. సాధారణంగా వంతెనల పక్కనే బస్టాండ్ల వద్ద జనం కూడా ఎక్కువగా ఉంటున్నారు. ప్రమాదాలు సంభవిస్తే నష్టం తీవ్రంగా ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వంతెనలు.. జర జాగ్రత్త

భీమడోలు మండలం పరిధిలో గోదావరి కాలువపై పూళ్ల, కురెళ్లగూడెం, పాతూరు, గుండుగొలను గ్రామాల్లో వంతెనలు శిథిలావస్తకు చేరాయి. గుండుగొలను వద్ద కూలిన వంతెన స్థానంలో శాశ్వత వంతెన పనులు నత్తనడక సాగుతున్నాయి. వంతెన నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. సమస్యను పరిష్కరించడంలో తాత్సారాన్ని చూపుతున్నారు. తాజాగా ఉంగుటూరు మండలం నారాయణపురం వద్ద వంతెన కూలింది. దీంతో ప్రజల అగచాట్లు వర్ణనాతీతం. పూళ్ల వంతెన నిర్మించి శతాబ్ధ కాలం పూర్తయింది. ఎంఎం పురం, సాయన్నపాలెం, నిడమర్రుల్లో విస్తరించిన చేపల చెరువులకు భారీ వాహనాల్లో మేత, చేపల లోడ్ లారీలు యథేచ్ఛగా సాగుతున్నాయి. దీంతో బీటలు వారిన వంతెన కూలుతుందేమోనని భయం గుప్పెట్లో ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. కురెళ్లగూడెం వద్ద కాలువపై ఉన్న ఇరుకైన వంతెన రహదారికి ఎత్తులో ఉండడంతో ఆ వంతెనపై నుంచి కొల్లేరు గ్రామాలకు వెళ్లే భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే రక్షణ గోడ కూలింది. ఇరుకుగా ఉన్న వంతెనపై భారీ వాహనాలు ప్రయాణించడమే కష్టంగా ఉండగా భారీ లోడు వేసుకొని వెళ్లడంతో ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దీనిపై అధిక లోడు లారీలు వెళ్లకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పాతూరు వద్ద నిర్మించిన వంతెన గోడ కూలిపోయింది. వంతెనపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిందే. రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా ఉండాల్సి వస్తుందని, కనురెప్పపాటు నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం పొంచి ఉంటుందని వారు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు చేపట్టి వంతెనలు నిర్మించాలని జనం వేడుకుంటున్నారు. ఇరుకైన వంతెనలపై భారీ వాహనాల ప్రయాణాన్ని నిలిపివేయాలని, ప్రభుత్వం నిధులు వెచ్చించి వంతెనల నిర్మాణాలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

మర్యాదపూర్వక కలయిక


వైఎస్సార్‌సీపీ అధినేతతో మాజీ ఎమ్మెల్యే, వైస్ ఎంపీపీ

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, దెందులూరు మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి కృషి చేయాలని జితేంద్రకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి వివరించారు.

రేపు వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశం


వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాట్లాడుతున్న అబ్బయ్యచౌదరి

పెదవేగి: ఈ నెల 4న ఏలూరులో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నడిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఈ నెల 4న ఉదయం 9 గంటలకు వట్లూరులో గల శ్రీ కన్వెన్షన్ కల్యాణ మండపంలో దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి యువత కీలకం


నాగులదేవునిపాడులో కామిరెడ్డి నానికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి యువత కీలక బాధ్యతలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. బుధవారం మండలంలోని నాగులదేవునిపాడు గ్రామంలో ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. దెందులూరు మండలం పార్టీ అధ్యక్షుడిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికై నందుకు తామంతా సంతోషంగా ఉన్నామని నాగులదేవునిపాడు యూత్ అన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యేగా కొఠారు అబ్బయ్య చౌదరి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కామిరెడ్డి నాని అన్నారు.

ఇరిగేషన్ ఏఈగా శివకృష్ణ


ఏఈ శివకృష్ణ

దెందులూరు: మండల ఇరిగేషన్ ఏఈగా శివ కృష్ణ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి బదిలీపై దెందులూరు ఏఈగా వచ్చిన శివకృష్ణ మాట్లాడుతూ శాఖాపరమైన లక్ష్యాల సాధనకు రైతులు, సిబ్బంది ఉన్నతాధికారుల సహాయ సహకారాలతో తనవంతు కృషి చేస్తానన్నారు. డివిజనల్ ఇంజనీర్ గని రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న లాజర్‌బాబు భీమడోలు మండలానికి బదిలీ అయ్యారు.

సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ


ఎస్సీ బాలికల వసతి గృహానికి సీలింగ్ ఫ్యాన్లను అందజేస్తున్న లయన్స్ సభ్యులు

గణపవరం: బాలికల వసతి గృహంలో ఫ్యాన్లు పాడై విద్యార్థినులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని లయన్స్‌క్లబ్ దృష్టికి తీసుకురాగా క్లబ్ తరపున సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. సీలింగ్ ఫ్యాన్లకు వంకాయల నాగపండు ఆర్థిక సాయం అందించారని క్లబ్ అధ్యక్షుడు నరేష్ తెలిపారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవి, లయన్స్ సభ్యులు కె.సత్యనారాయణ మూర్తి, కె.విశారద, రావూరి నాగరాజు, రవి కుమార్, గఫూర్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న దాత

గణపవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయమని పలువురు అన్నారు. బుధవారం గణపవరం మండలం ముప్పర్తిపాడు గ్రామంలోని యూపీ, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత కానుమిల్లి శశిశేఖరరావు రూ.40 వేల విలువైన నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అల్లూరి బదరీనాథ్, సర్పంచ్ కర్రి రాధాలక్ష్మి దాత శశి శేఖరరావును అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ


మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారి శ్రీనివాసరాజు

దెందులూరు: దెందులూరు గ్రామంలో వ్యవసాయ శాఖ లక్ష్యాల సాధనలో భాగంగా 88 మట్టి నమూనాలను సేకరించామని ఏవో ఎల్.శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం దెందులూరు, సత్యనారాయణపురం గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది నాగేంద్ర రామకృష్ణ, సహాయకులు చేసిన మట్టి నమూనా సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మట్టి నమూనాలను సేకరించామని, వాటిని ల్యాబ్‌కు పంపిస్తామని రిపోర్టు వచ్చిన తరువాత రైతులకు వివరించి సూచనలు, సలహాలు తెలియజేస్తామన్నారు.

నేడు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాక

దెందులూరు: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఆర్.శైలజ గురువారం దెందులూరు బాలసదనానికి విచ్చేస్తారని జిల్లా అధికారులు తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనాన్ని మధ్యాహ్నం మూడు గంటలకు విచ్చేస్తారన్నారు.

● ముమ్మరంగా సాగు పనులు


పొలాన్ని దుక్కి దున్నుతున్న రైతు

మండలంలో రైతులు ముమ్మరంగా సాగు పనులు చేస్తున్నారు. 17 గ్రామ శివారు ప్రాంతాల్లో 14,500 ఎకరాల ఆయకట్టు ప్రస్తుత సీజన్‌లో సాగులో ఉంది. సాగు నీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాట్లు చేసిన నేపథ్యంలో దుక్కి దున్ని, విత్తనాలు నాటడం నారు పనుల్లో రైతన్న బిజీబిజీగా ఉన్నారు. స్వర్ణ 13 18 రకాలను రైతులు ఈ ప్రాంతంలో అధికంగా పండిస్తారు. శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే పొలం పిలుస్తోంది సమావేశాలు నిర్వహించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. - దెందులూరు


నారుమడి తీస్తున్న రైతులు

రేషన్ కష్టాలు.. యథాతథం


రేషన్ బియ్యం మూటను నెత్తిపై పెట్టుకొని వెళుతున్న దృశ్యం

భీమడోలు: రేషన్ కష్టాలు ఈ నెల కూడా కార్డుదారులకు తప్పేటట్లు లేవు. వర్షంలోనే తడుస్తూ సరుకులను మోసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత నెల నుంచి ఎండీయూ వాహనదారులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. దీని ఫలితంగా రేషన్ సరుకుల కోసం లబ్ధిదారులు దుకాణాల వద్దకే వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. మండల వ్యాప్తంగా 35 రేషన్ దుకాణాల పరిధిలో 20 వేలకు పైగా కార్డులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రెండో నెల రేషన్‌ను జులై ఒకటో తేదీ నుంచి పంపిణీ ప్రారంభించారు. రెండో రోజైన బుధవారం కూడా రేషన్ భీమడోలు బైపాస్ రోడ్డులోని రేషన్ దుకాణం వద్దకు ఓ బాలిక తాతను వెంటబెట్టుకొని వచ్చి, రేషన్ బియ్యం తీసుకెళ్లారు. ఆ వృద్ధుడు బియ్యం మూటను నెత్తిన పెట్టుకొని ఆయాసపడుతూ వెళ్లా డు. ఇదేతరహాలో మండలవ్యాప్తంగా అనేక చిత్రాలు దర్శనమిస్తున్నాయి. రేషన్ దుకాణాలు గ్రామానికి దూరంగా ఉండడం, సార్వా పనులు ముమ్మరంగా సాగుతున్న వేళ రేషన్ సరుకులు తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందని కార్డుదారులు అంటున్నారు.

రహదారిపై గుంతలు పూడ్చరూ..


కైకరం-చేబ్రోలు మధ్యలో జాతీయ రహదారిపై పడిన గుంతలు


ఉంగుటూరు-నారాయణపురం మధ్యలో పడిన గోతులు

ఉంగుటూరు: జాతీయ రహదారి కదా వేగంగా వెళ్లొచ్చనుకున్నారా అంతే సంగతులు. ఇటీవల కురిసిన వర్షాలకు జాతీయ రహదారి ఎక్కడబడితే అక్కడ గుంతలు ఏర్పడ్డాయి. జాతీయ రహదారిపై వేగంగా వెళ్లిన కార్లు గుంతల్లో పడి యాక్సిల్సు విరిగిపోతున్నాయి. అలా విరిగిపోయిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. అలాగే ద్విచక్ర వాహనదారులకు త్రుటిలో ప్రమాదాలు తప్పాయి. గుంతలు చూసుకోకుండా వెళ్లారా అంతే సంగతులు. మోటారు సైకిళ్లు, కార్లు దెబ్బ తినే పరిస్థితి నెలకొంది. జాతీయ రహదారి పర్యవేక్షణ అధికారులు ఈ గుంతలను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కొత్త వరి వంగడాలను ప్రోత్సహించాలి


రైతులకు కౌలు కార్డులు అందజేస్తున్న వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా

ఉంగుటూరు: కొత్త వరి వంగడాలను రైతులు తమ పొలాల్లో నాటి ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా అన్నారు. బుధవారం ఉంగుటూరు రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ పంట సమయంలో రైతులు కొత్త వరి వంగడాలను వాడాలని సూచించారు. తద్వారా అధిక దిగుబడి సాధించొచ్చన్నారు. కౌలు రైతులు కౌలు కార్డులు పొందాలని తెలిపారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ ఆవశ్యకత వివరించారు. క్షేత్ర సందర్శనలో భాగంగా వరి నాట్లు, నారుమళ్లను ఆయన పరిశీలించారు. భీమడోలు వ్యవసాయ సంచాలకులు పి.ఉషా రాజకుమారి, మండల వ్యవసాయ అధికారి ఎస్ఎస్ ప్రవీన్‌కుమార్, మత్స్య శాఖ మండల అధికారి కె.మంగరావు, పశు సంవర్థక శాఖ అధికారి బి.శిరీష, సర్పంచి బండారు సింధు, మధు, రైతులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు


హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఉంగుటూరు: అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని ఏలూరు ఉప విద్యాధికారి నిమ్మగడ్డ రవీంద్రభారతి అన్నారు. బుధవారం కైకరం హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు పదవీ విరమణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరు గుళ్ల ప్రసాదరావు అని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సీహెచ్ శ్రీనివాస కుమార్, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, శాప్ డైరెక్టర్ రవీంద్ర, సర్పంచి శలగల గోపి, హైస్కూలు కో–ఆప్షన్ మెంబర్ పి.వేణుగోపాల్, డీవీఎస్ నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మెన్ అల్లూరి జగదీశ్వరి, ఎంపీటీసీ చెన్ను సత్యవేణి, సమగ్ర శిక్షణ కేంద్రం కో–ఆర్డినేటర్ పంకజ్‌కుమార్, డీసీఈబీ సెక్రటరీ సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌డబ్ల్యూ మంగతాయారుకు సన్మానం

బగా పనిచేసే అధికారికి ఎపుడు గుర్తింపు ఉంటుందని ఎంపీడీవో రాజ్‌మనోజు అన్నారు. బుధవారం ఉంగుటూరు పంచాయితీ సామాజిక భవనంలో పదవీ విరమణ చేసిన ఏఎస్‌డబ్ల్యూ నార్కేడుమిల్లి అలివేలు మంగతాయారుకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. ఏలూరు ఏఎస్‌డబ్ల్యూ శ్రీనివాస్, రిటైర్డు ఏఎస్‌డబ్ల్యూ వీరభద్రమూర్తి, తదితరులు మంగతాయారును అభినందించారు.

ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

వేలేరుపాడు: గోదావరి వరదలు దృష్ట్యా ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు వేలేరుపాడు మండల తహసీల్దార్ కార్యాలయంలోని ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల వరదలకు మండలం నీటి మునుగుతుందని తెలిపారు. గూడు లేక తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని గుర్తు చేశారు. చీకటిలోనే తలదాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. అనారోగ్యం చేస్తే రవాణా సౌకర్యం లేక మరణం తప్ప వేరే దిక్కే లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా మండలానికి తగినన్ని బోట్లు, తాత్కాలిక పునరావాసాలు, హెల్త్ క్యాంపులు, నిత్యావసర సరుకులు, బరకాలు, కిరోసిన్ లాంటివి ఏర్పాటుచేయాలని కోరారు. రవాణా ఖర్చులు ప్రభుత్వమే ఇవ్వాలని పేర్కొన్నారు. పార్టీ మండల కార్యదర్శి ధర్ముల రమేష్, సీనియర్ నాయకులు మడివి దుర్గారావు, నాయకులు కారం వెంకట్రావు, మడకం ఏసుబాబు, కొత్త వెంకటేశ్వర్లు, కరటం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

దెందులూరు: వృద్ధుల సేవ దేవుని సేవతో సమానమని సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ కమాండర్ మేజర్ ఏసు రాజ్యం, లత అన్నారు. బుధవారం కొవ్వలి షాలేము వృద్ధుల ఆశ్రమంలో దాత లక్ష్మి పేస్టులు, బ్రష్‌లు, పళ్లు, రొట్టెలు వంటి నిత్యావసరాలను వృద్ధులకు పంపిణీ చేశారు. సాల్వేషన్ ఆర్మీ హోంలీగ్ ట్రెజరర్ లీనా ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వృద్ధుల పట్ల దయాగుణం కలిగి ఉండటంతో పాటు వారికి ఏదో ఒక రూపంలో సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో కొవ్వలి షాలేము, కొవ్వలి సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ మేజర్ సుబ్బారావు, ఏలూరు డివిజన్‌లో పలు కోర్ అధికారులు పాల్గొన్నారు.

పరశురామావతారంలో జగన్నాథుడు

ద్వారకాతిరుమల: పరశురామావతారంలో జగన్నాథుడు బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి దత్తత ఆలయమైన లక్ష్మీపురంలోని జగన్నాథ స్వామివారి ఆలయంలో రథోత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అవతారంలో దర్శనమిస్తున్నారు. ఈ క్రమంలో ఒక చేత్తో గండ్రగొడ్డలి, మరో చేత్తో పాత్రను పట్టుకుని ఉన్న పరశురాముని అవతారం భక్తులకు కనువిందు చేసింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి: మండలంలోని విజయరాయి సెక్షన్ కొప్పాక సబ్ స్టేషన్ పరిధిలోని అమ్మపాలెం, పెదకడిమి కొప్పాక, అంకన్నగూడెం గ్రామాలకు కొత్త బ్రేక ర్ ఎరక్షన్ నిమిత్తం ఈ నెల మూడో తేదీ శుక్రవారం ఉదయం 8నుంచి 4 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు పెదవేగిలో విద్యుత్ కోత

పెదవేగి: పెదవేగి సెక్షన్‌లో సబ్‌స్టేషన్ మరమ్మతులను ఆర్‌డీఎస్ఎస్ పథకంలో చేపట్టనున్న నిమిత్తం రామసింగవరం ఫీడర్ పరిధిలో రామసింగవరం, ఆసన్నగూడెం గ్రామాలకు, గుడిగుంట ఫీడర్ పరిధిలోని ఎంఆర్‌సీ కాలనీ, కొప్పులవారిగూడెం, నాగన్నగూడెం పరిసర ప్రాంతాలకు ఈ నెల 4వ తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా ఆయన కోరారు.

మోకాళ్లపై కార్మికుల నిరసన

జంగారెడ్డిగూడెం: సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు చేపట్టిన సమ్మె బుధవారం మూడో రోజు కొనసాగింది. మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ కంతేటి వెంకట్రావు అధ్వర్యంలో కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను త్వరగా పరిష్కారించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని వెంకట్రావు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.